# ప్రాణం ఖరీదు

ఫోన్ మోగింది.

విరాగ్గా చూశాడు భాస్కరరాజు.

ఇప్పటికే కొన్ని వందలసార్లు ఫోనెత్తి మాట్లాడాడు. మళ్ళీ ఎవడో— ఏ ఊర్నుంచో...

"సారీ భాస్కర్— మై హార్ట్ కండోలెన్స్!!"

కంఠంలో విషాదాన్ని మేళవించి చెబుతాడు.

నిర్విరామంగా మోగుతున్న ఫోనందుకుని అన్నాడు భాస్కరరాజు.

"హలో భాస్కర్ హియర్."

"సారీ బావీ— ఇప్పుడే తెలిసింది. వెంటనే బయల్దేరుదామంటే ఫ్లయిట్ టైం దాటిపోయింది. సాయంత్రం ఫ్లయిట్‌లో వస్తున్నాను. అప్పటివరకు ధైర్యంగా వుండు..."

"అలాగే— అలాగే"

ఫోన్ పెట్టి హాల్లోకి చూశాడు.

తండ్రి శవం మీద పూలమాలలు పేర్చి ఉన్నాయి. ఎవరెవరో వచ్చి పూలమాలలు పెడుతున్నారు. అందరి కళ్ళలో విషాదం— బాధ తనెప్పుడూ చూడని తన బంధువులు శవం చుట్టూ కూర్చుని శోకాలు పెడుతున్నారు. ఎవరో వారిని ఓదార్చుతున్నారు.

'షిట్'

అసహనంగా తల విదిల్చాడు భాస్కరరాజు.

ఈ తంతు ఇంకెంత సేపు? త్వరగా శ్మశానికి తీసుకెళ్ళి తగలేసేదానికి ఇంకేవిటి ఆలస్యం?

విరగ్గా సిగరెట్ వెలిగించాడు భాస్కరరాజు.

అతని పెదవుల మీద ఎంత దాచాలని ప్రయత్నించినా దాగని విరునవ్వు మెరుస్తోంది.

కోటి యాభై లక్షలు!!

యస్— అంత ఆస్తికి తానిప్పుడు వారసుడు

— బతికున్నంతకాలం తన స్వేచ్ఛకూ— స్వాతంత్ర్యానికీ కళ్ళాలు వేశాడు తండ్రి— ఓ వంద రూపాయలు తనిష్ట ప్రకారం ఖర్చు పెట్టుకునే స్వాతంత్ర్యం ఇవ్వలేదు. పేరుకి కోటీశ్వరుడి ఏకైక కొడుకు—

జేబులో ఎప్పుడూ పది రూపాయలకు మించి ఉండదు.

నిజానికి తండ్రి చనిపోవాలని తానెంతకాలం నుంచో ఎదురు చూస్తున్నాడు.

అదృష్టం—

ఈ రోజు ఆ భగవంతుడు తన కోరిక తీర్చాడు.

ఈ రోజు నుంచి తనిష్టం.

తనను అజమాయిషీ వేస్తూ— అదిలిస్తూ— మందలిస్తూ— అనుక్షణం తనను వెంటాడే తండ్రి లేడు.

ఇప్పుడు ఈ సామ్రాజ్యానికి తనే ఏకైక వారసుడు—

"బాబూ."

చప్పున సిగరెట్ యాష్ ట్రేలో పడేసి వెనుక్కు తిరిగాడు భాస్కరరాజు.

తండ్రి స్నేహితుడు కేశవరావు బాధగా చూస్తున్నాడు తనను.

"ఏవిటంకుల్" అన్నాడు భాస్కరరాజు.

కేశవరావు అతని భుజం మీద చేయి వేసి—

"అలా ఒంటరిగా కూర్చుని బాధపడకు నాయనా— మంచివారినే దేవుడు త్వరగా తీసుకెళ్తాడంటారు. అలా దిగులు పడకు— నువ్వు ఏకాకివని ఎప్పుడూ అనుకోకు— మేమంతా నీ వాళ్ళమే" అన్నాడు.

"థాం... థాంక్యూ అంకుల్" దిగులుగా అన్నాడు భాస్కరరాజు.

"వెళ్దాం— పద— అంతా నీకోసమే చూస్తున్నారు" అతనీ భుజం మీద చెయ్యేసి మెట్లు దింపుతూ అన్నాడు కేశవరావు.

★★★★★★

పది రోజులు గడిచి పోయాయి.

కర్మకాండలన్నీ పూర్తి చేసి— వచ్చిన బంధువులందర్నీ బలవంతంగా పంపించి వేశాడు భాస్కరరాజు.

ఒక్కడివీ ఇబ్బంది పడతావనీ తోడుగా ఉంటామనీ బతిమలాడినా వారందర్నీ నిర్దాక్షిణ్యంగా నిరాకరించాడు.

ఆ విశాలమైన భవనంలో—

ఆ రాత్రి—

దాదాపు పాతిక మంది మిత్రులకు పార్టీ ఇస్తున్నాడు భాస్కరరాజు. ఈ రోజు కోసమే అతను పది రోజులుగా నిరీక్షిస్తున్నాడు. గతంలో తనను తండ్రి చాటు బిడ్డనీ— చేతకాని వాడిననీ— హేళన చేసిన స్నేహితులందర్నీ పిలిచాడు. వారిలో ఆరుగురు అమ్మాయిలు కూడా ఉన్నారు.

గ్లాసెత్తి అన్నాడు భాస్కరరాజు.

"ఛీర్స్."

"ఛీర్స్"

స్నేహితులంతా ఉత్సాహంగా గ్లాసులెత్తి అరిచారు.

ఆ క్షణం నుంచి—

రాయల్ సెల్యూట్ ఆ గదిలో వరదలై ప్రవహించింది.

కోళ్ళు— మేకలు— చేపల్తో ఎన్ని విధాల వంటకాలు చేయవచ్చో అన్ని వంటకాలు ఆ గదిలో ప్రత్యక్షమయ్యాయి.

"హేయ్ బావీ— ఈ రోజు నుంచీ నువు ఫ్రీస్ట్వి— మమ్మల్ని కనీసం నీ సైనికులుగా నైనా ఉండనిస్తావా?" అడిగాడో మిత్రుడు.

పెద్దగా నవ్వాడు భాస్కరరాజు.

"డోంట్ టాక్ రబ్బిష్ మిత్రమా— మీరంతా లేకపోతే నాకు లైఫ్‌లో థ్రిల్లేముంటుంది.

## చల్లా సుబ్రహ్మణ్యం

సైనికులు కాదు— నా ఆప్తులు మీరంతా'' అన్నాడు.

అంతా ఆనందంగా చప్పట్లు కొట్టారు.

''డాళింగ్.''

మత్తుగా తలతిప్పి చూశాడు భాస్కరరాజు.

వినీత.


నెత్తురులాంటి లోనెక్ స్లీవ్ లెస్ బ్లౌజ్ మీద అదేరంగు చీరలో నిలబడి— అతని భుజం మీద చెయ్యేసి మత్తుగా పిలిస్తోంది.

''యస్— చెప్పు నీతా.''

పచ్చగా మెరుస్తున్న ఆమె నడుము మీద ముడతను సవరిస్తూ అన్నాడు భాస్కరరాజు.

''ఆకలిగా వుంది బావీ'' మత్తుగా అతని భుజం మీద తలాన్చి అంది.

''అదేవిటి నీతా— ఇన్ని వంటకాలు ఇక్కడుంటే ఇంకా ఆకలంటావేం?'' ఆశ్చర్యంగా అన్నాడు భాస్కరరాజు.



అక్కడున్న వారంతా ఆమెను ఆశ్చర్యంగా చూశారు.

"ఆకలి కాదు బావీ... ఇదీ 'ఆ' 'ఆకలి.'

ఎర్రటి కింది పెదవిని మునిపంటితో నొక్కుతూ అంది.

ఆమె మాటకు అక్కడున్న వారంతా కేరింతలు కొడుతూ— చప్పట్లు కొట్టారు.

'యస్— మాకూ ఆకలిగా ఉందిరా బావిగా.'

అంతా కోరస్‌గా అరిచారు.

నవ్వుతూ మిత్రుల్ని చూశాడు భాస్కరరాజు.

అతనికి పట్టరాని ఆనందంగా ఉంది— ఎప్పట్నుంచో ఊహించుకుంటున్న ఫాంటసీ ఈ రోజు నిజం కావటంతో అతనికి ఎక్సయిటింగ్గా ఉంది.

"ఒకే ఫ్రెండ్స్— కానీ— చిన్న ప్రాబ్లెమ్" అన్నాడు ఉత్సాహంగా.

"ఏ...విటది?" మత్తుగా అడిగింది వినీత.

"ఏమీలేదు— మీరు ఆరుగురే ఉన్నారు. మేము ఇరవైమంది ఉన్నాం. ఎలాగా అని ఆలోచిస్తున్నాము" అన్నాడు.

"నువు వర్రీకాకు బాస్— ఆ ఏర్పాట్లేవో నేను చూస్తాను." అంటూ ఫోన్ దగ్గరకెళ్ళి ఎవరికో ఫోన్ చేసి— అందర్నీ చూస్తూ అన్నాడతను.

"ఇంకో అరగంటలో ఇరవైమంది అమ్మాయిలు మనల్ని ఆనందింప చేయటానికి వస్తున్నారు."

మరుక్షణం—

కేరింతలు— ఈలలు చప్పట్లతో ఆ భవనం మారు మోగిపోయింది కొందరు ఉత్సాహంతో డ్యాన్స్ చేస్తున్నారు. కొందరు మత్తుగా నేలమీద పడి దొర్లుతున్నారు.

ఆరుగురు అమ్మాయిలు చుట్టూ పదిమంది చేరి— బూతు జోకులేస్తున్నారు. అమ్మాయిలు విరగబడి నవ్వుతున్నారు.

అక్కడి వాతావరణం— అదో ప్రపంచంలా ఉంది.

బయట ప్రపంచంలో తమకే మాత్రం సంబంధం లేని వాళ్ళలా ప్రవర్తించసాగారు.

వీరందర్నీ—

గోడకున్న నిలువెత్తు చిత్రపటంలోంచి నిశితంగా గమనిస్తున్నాడు భాస్కరరాజు తండ్రి.

"అబ్బాయిగోరూ."

ఫోన్‌లో పిలిచాడు నౌఖరు.

"ఏవిట్రా" విరాగ్గా అరిచాడు భాస్కరరాజు.

"మీ కోసం ఎవరో వచ్చారు బాబూ" వినయంగా చెప్పాడు నౌఖరు.

"ఎవడ్రా వాడు— ఎవర్నీ చూడనని చెప్పు— వెళ్ళమను" కసిరాడు భాస్కరరాజు.

"చెప్పాను బాబూ— అయినా ఒక్కసారి మిమ్మల్ని చూసి వెళ్తామంటున్నారు."

"షిట్."

ఫోన్ విసురుగా క్రెడిల్ చేసి— మిత్రులతో చెపుదామని తలెత్తి చూశాడు.

ఆ అవసరం అతనికి కనిపించలేదు.

ఎవరి ప్రపంచంలో వారున్నారు.

తలుపు తీసుకుని బయటకొచ్చి— మెట్లు దిగి— హాల్లోకొచ్చిన నౌఖర్ని అరిచాడు.

"ఎవడ్రా వాడు?"

నౌఖరు భయంగా అతన్ని చూస్తూ— ఓ మూలకు చూపించాడు. భాస్కరరాజు అటువేపు చూశాడు.

అక్కడ—

యాభై ఏళ్ళుపై బడిన ఓ స్త్రీ—

ఆమె పక్కనే ఇరవై రెండేళ్ళ యువతి నిలుచున్నారు.

మధ్య తరగతి సగటు మనుషులకన్నా ఇంకో మెట్టు దిగువనే ఉన్నట్టనిపించింది.

ఆ స్త్రీ చేతిలో చిన్న సంచి— ఆమె పక్కనే నిలుచున్న యువతిని చూశాడు భాస్కరరాజు.

అందంగా అమాయకంగా ముగ్ధత్వంతో— అప్పుడే అరవిరిసిన మల్లెమొగ్గలా ఉంది.

"ఎవరు మీరు? ఏం కావాలి?" అడిగాడు భాస్కరరాజు.

ఆరు పెగ్గులు రాయల్ సెల్యూట అతన్ని నిలకడగా నిల్చోనివ్వటం లేదు.

"నేను బాబూ— మీ అత్తయ్యను— సుందరమ్మను— ఇది నా కూతురు— అన్నపూర్ణ— మీ నాన్న బ్రతికున్నంతకాలం మమ్మల్నెవర్నీ రానివ్వలేదు— కానీ రక్త సంబంధం నాయనా— ఎంత కాదన్నావాడు నా అన్నయ్య— ఒక రక్తం పంచుకు పుట్టిన వాళ్ళం— మాకు ఈ రోజు ఉదయమే వాడు పోయిన విషయం తెలిసింది. విలవిల్లాడిపోయాను— ఇప్పుడు ఇక్కడికొచ్చి చేసేదేమి లేకపోయినా— కనీసం అనాథలా ఉన్న నిన్నైనా చూసిపోదామని వచ్చాము" కళ్ళొత్తుకుంటూ అంది.

భాస్కరరాజుకు విరాగ్గా ఉంది.

అవతల గదిలో అమ్మాయిలు— రాయల్ సెల్యూట్— ఆ ప్రపంచం ఆ ఆనందం— మంచి —

హఠాత్తుగా—

ఈవిడెవరో అత్తయ్యంటూ ప్రవేశించి నాశనం చేస్తోంది.

"ఇంతకీ— ఏవిటంటావ్?" మత్తుగా రవ్వంత అసహనంగా అన్నాడు.

ఆమె చివాలున చూసిందతన్ని— ఆమె అభిమానం దెబ్బతిని— అహం మేల్కొని—

"ఏవిటి బాబూ" అంది.

"చూడండి— నాకెవరూ లేరు— నాకెవరూ అవసరం లేదు కూడా. ఇలా అత్తయ్యలమంటూ ఆడపిల్లలను వెంటబెట్టుకుని లక్ష మంది వచ్చారు. ప్లీజ్— నాకవతల అర్జంటు పనులున్నాయి. నేను వెళ్ళాలి" సిగరెటు వెలిగిస్తూ అన్నాడు భాస్కరరాజు.

ఆమె మాట్లాడలేదు.

రెండే రెండు క్షణాలు అతన్ని చూసి—

కూతురి భుజం మీద చెయ్యేసి నెమ్మదిగా అంది.

"పద తల్లీ— వెళ్దాం"

ఇద్దరూ గుమ్మం వేపు వెళ్ళారు. ఆమె తలుపు తీస్తూ వెనక్కు తిరిగి అంది.

"చూడు భాస్కర్— మాకు గతిలేక— లేక — నా కూతురికి పెళ్ళి చేయలేక నీ దగ్గరకు రాలేదురా— స్వంత అన్నయ్య చనిపోతే— కనీసం కబురు కూడా చేయని నీ సంస్కారాన్ని మెచ్చుకుంటానికీ రాలేదు— కాకపోతే అమ్మానాన్నలు లేక— ఒంటరిగా ఎంత కుమిలి పోతున్నావో ఊహించి— ఓదార్చి పోదామని వచ్చాను— నీకు తెలీదేమో— నీవు పుట్టినప్పట్నుంచీ— ఎనిమిదేళ్ళ వరకూ— అంటే మీ అమ్మానాన్నలు అమెరికా వెళ్ళిన ఎనిమిదేళ్ళు నిన్ను కన్నకొడుకులా పెంచింది.

నేనే— అందుకే— ఆ పెంచిన మమకారాన్ని చంపుకోలేక చూసిపోదామని వచ్చాను గానీ— నీ ఆస్తి చూసి రాలేదు— శలవ్."

విసురుగా మూసుకున్న తలుపును చూసి—

పెద్దగా నవ్వుకుంటూ— మేడమెట్లు ఎక్కుతున్న అతన్ని భయంగా చూశాడు నౌఖరు.

ఉలిక్కిపడి లేచాడు భాస్కరరాజు.

వాచీ చూసుకున్నాడు— మూడున్నర.

తన ప్రక్కనే దాదాపు నగ్నంగా పడుకున్న

వినీతను చూశాడు.

ఓ క్షణం తర్వాత—

అప్పుడు మెలకువ ఎందుకొచ్చిందో అర్థమైందతనికి.

గుండెలో సన్నగా నొప్పి—

నెమ్మదిగా ప్రారంభమై క్రమేపీ ఉధృతమవ సాగింది. భయంతో లేచి కూర్చోబోయాడు.

అతనివల్ల కాలేదు. భయంతో చెమటలు పట్టసాగాయి. గుండెనెవరో మెలితిప్పుతున్న ఫీలింగ్.

వినీతను వేత్తో తట్టి లేపాలని ప్రయత్నించాడు.

ఆమె గాఢ నిద్రలో వుంది.

నొప్పి ఉధృతం అవుతోంది— డాక్టర్‌కు ఫోన్ వేయాలని వెయ్యేత్తాడు.

గుండె కలుక్కుమంది.

అతనికి ఊపిరందటం లేదు.

గుండెలో మేకులు దింపుతున్న ఫీలింగ్.

"రేయ్— ఫ్రెండ్స్— రాండిరా— తర్వగా రండి— నాకేదో అవుతోంది" తలతిప్పి చూశాడు.

ఆ హాల్లో ఆడామగా— భేదం లేకుండా— హాలంతా అస్తవ్యస్తంగా— ఒకరిమీద మరొకరు పడి మత్తుగా గాఢ నిద్రలో వున్నారంతా. అతను భరించలేని ఉద్విగ్నతతో సతమతమవుతున్నాడు.

ఒక్కరు— కనీసం ఒక్కరైనా మేలుకుని ఉంటే—

డాక్టర్‌కు ఫోన్ వేయొచ్చు.

"రేయ్— నేను చచ్చిపోతున్నాను— ప్లీజ్ లేవండి— ప్లీజ్..."

అతని కళ్ళు వర్షిస్తున్నాయి.

కోటి యాభై లక్షలు!!!

తన తదనంతరం అనాధ శరణాలయానికి చెందేట్లు రాశాడు తండ్రి. భరించలేని దిగులుగా బాధగా ఉందతనికి.

"ఎనిమిదేళ్ళు నిన్ను పెంచిన మమకారంతో చూసిపోదామని వచ్చాను"

'అత్తయ్యా.''

అతని మనస్సు బాధగా మూలిగింది.

అతని కళ్ళకున్న పొరలేవో తొలగిపోతూ—

తానింతకాలం ఎంత అంధకారంలో వున్నాడో తెలుసుకునే లోపు అతని కళ్ళు శాశ్వతంగా మూతపడ్డాయి.

●●

## వైద్యం కోసం వచ్చిన పేషెంట్లతో డాక్టర్ల శృంగారం

వైద్యం కోసం వచ్చిన పేషంట్లతో లైంగిక సంబంధం ఏర్పర్చుకున్న డాక్టర్లు 90% వరకు ఉన్నారని ఒక సర్వేలో వెల్లడయింది. తాము వైద్య వృత్తిలో దిగినప్పటి నుంచీ ఇప్పటి వరకు ఒక పేషంటుతో తొడ సంబంధాలు కలిగివున్నట్లు ఆ డాక్టర్లు ఒప్పుకున్నారు. వైద్య రంగంలో సంచలనం సృష్టించిన ఈ సర్వేని కాలిఫోర్నియా — శాన్‌ఫ్రాన్సిస్కో యూనివర్శిటి సైక్రియాటిస్ట్ డాక్టర్ కె.గార్టెల్ నిర్వహించారు.

పేషంట్లతో లైంగిక సంబంధాలు కలిగిన వైద్యుల శాతం మరింత ఎక్కువగా వుండే అవకాశముందని డాక్టర్ గార్టెల్ వ్యాఖ్యానించారు. పేషంట్లతో లైంగిక సంబంధమున్న డాక్టర్లు కన్న తం డ్రుల వలె వైద్యం వేయవలసింది పోయి తొడసంబంధాల కొరకై అర్రులు చాచడం ఎంతగా ఉంది కదండి.

పేషంట్లతో డాక్టర్లు లైంగిక సంబంధాన్ని నీతి బాహ్యమైనదిగా అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ఈసడించింది. మన దేశంలో సర్వే చేస్తే డాక్టర్ల గురించి తెలుసుకోవచ్చు.

ఏది ఏమైనా ఈ విషయమై ప్రపంచ వనితా లోకం నిరసన వ్యక్తం చెయ్యాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## U.S.A. కంటె జపాన్ తలసరి ఆదాయం అధికం

ఆసియాలో బ్రహ్మాండమైన పారిశ్రామిక దేశం జపాన్ తలసరి గ్రాస్ నేషనల్ ప్రోడక్ట్ (GNP) U.S.A. మరియు అభివృద్ధి పొందిన ఇతర పశ్చిమ దేశాలకంటే అధికం. 1987లో జపాన్‌లో తలసరి GNP 19,553 డాలర్లు అయితే U.S.Aలో 18,570 డాలర్లు.

చిన్న దేశమైనా అమెరికాకంటే ముందంజ ఉందండి. మరి మన ఇండియా స్థానం ఎప్పుడు వ్రాసుకోవాలో మరి.

— ముద్దా విజయలక్ష్మి.

